## క్లుప్తంగా

### యూనివర్సల్ కాలేజీకి అటానమస్ హోదా



మేడికొండూరు: ప్రతి విద్యార్థి తన జీవితం ఎల్లప్పుడూ అభివృద్ధి దిశగా పయనించాలంటే సద్గుణాలు కలిగి ఉండాలని యూనివర్సల్ కాలేజీ ఫౌండర్ డాక్టర్ బిషప్ గాలిబాలి అన్నారు. మండల పరిధిలోని డోకిపర్రు గ్రామంలోని ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తున్నట్లు న్యూఢిల్లీలోని యూజీసీ యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన యాన్యువల్ డే క్రిస్టర్ జూబ్లీ ఇయర్ అటానమస్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఫౌండర్ బిషప్ గాలిబాలి, కళాశాల చైర్మన్ గుంటూరు మేత్రాసనం పీఠాధిపతులు బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించడం వల్ల స్థానిక పరిస్థితులకనుగుణంగా సొంత పాఠ్యప్రణాళిక ఏర్పాటుతోపాటు, మూల్యాంకన డిగ్రీలు ప్రదానం చేయవచ్చన్నారు. అటానమస్ హోదా అకాడమీకి 2024–25 విద్యా సంవత్సరం నుంచి 2025–29 వరకు ఐదు సంవత్సరాలు లభించినట్లు వెల్లడించారు. ఈ హోదాలో బహుళజాతి కంపెనీలు విస్తృతంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాయన్నారు. విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు, మెరుగైన విద్యనందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సటిల్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ ఎం.ఫాతిమా మర్రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరెడ్డి, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

**యజమాని నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు**

మంగళగిరి: యజమాని నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కురగల్లు గ్రామానికి చెందిన ముదరబోయిన బాజి(30) అదే గ్రామానికి చెందిన పసుమర్తి వెంకటేశ్వరరావు బ్రిక్స్ రాయి తయారీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా బ్రిక్స్ మిషనరీ వద్ద విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురికాగా బాజి విద్యుత్ వైర్లు కారణంగా షాక్ కొట్టే అవకాశం వుందని యజమాని వెంకటేశ్వరావు దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా వెంకటేశ్వరరావు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో బాజి బుధవారం పని చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కూలిపోయాడు. తోటి కార్మికుల సహాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా బాజి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. బాజి భార్య ముదరబోయిన లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### భవనంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

మంగళగిరి: నిర్మాణంలో ఉన్న భవనంపై పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రగాయాల పాలై ప్రాణాప్రాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన చోటు చేసుకుంది. నగరంలోని లక్ష్మీనృసింహస్వామి కాలనీలో 13వ వార్డు సచివాలయం ఎదుట భవన నిర్మాణం కొనసాగుంది. బుధవారం భవనంపై పని చేస్తున్న కార్మికుడు నాగేశ్వరరావు ప్రమాదవశాత్తూ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా తీవ్ర గాయాలైన నాగేశ్వరరావు ప్రాణాప్రాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నాగేశ్వరరావు పనిచేస్తున్న భవనం ఎదుట వార్డు సచివాలయం ఉండగా సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి అధికారులకు అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్న భవనం గురించి తెలియకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



ర్యాలీలో పాల్గొన్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



బేతపూడిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్



తాడేపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



దుగ్గిరాలలో పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జడ్పీటీసీ అరుణ

- అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలి
- ఇందిరానగర్, బేతపూడిలలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

మంగళగిరి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్ 4వ సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత వార్డులో అమలైన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. 4వ సచివాలయ పరిధిలో రూ.17 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందడం విశేషం. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు అందిన సంక్షేమ పథకాలను వివరించి తమ అవే పథకాలు యధావిధిగా ఇంటి వద్దనే అందుకోవాలంటే మళ్లీ సీఎం జగనే కావాలని అందరం జగనన్నకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. 4వ సచివాలయ పరిధిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.17 కోట్లు సంక్షేమ పథకాలు నేరుగా మహిళల ఖాతాలలోకి జమ అవడం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయనేందుకు నిదర్శనమన్నారు. పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు తోట శ్రీనివాసరావు, మలక్‌బాబు, సాలి ప్రశాంత్, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, గుంటి విజయలక్ష్మి,కురగంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**బేతపూడిలో..**

నగర పరిధిలోని బేతపూడి సచివాలయం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి జెండాను ఎగురవేసిన కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎంవీ లక్ష్మీపతిరావు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి విజయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బేతపూడి నరసయ్య, బేతపూడి సాంబయ్య, బేతపూడి కిషోర్, ముక్కమాల శివయ్య, క్రోసూరి రాజా రమేష్, బేతపూడి భరత్, గైరుబోయిన పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం**

తాడేపల్లిరూరల్ : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సలాం సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుర్రముక్కు వేణుగోపాలస్వామి, పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజులు పాల్గొన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలే, ఇవ్వని హామీలు కూడా అనేకం అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, ప్రాంతం, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు ముదిగొండ ప్రకాష్, వేముల లక్ష్మి రోజా, సింహాద్రి గోపి, సీనియర్ నాయకులు కురగంటి ఉదయరాజు, సెల్ కన్వీనర్లు బత్తుల దాసు, సయ్యద్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

– కొలనుకొండ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి పాల్గొన్నారు. తొలుత ఆ ప్రాంతంలో ప్రజలకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి గోపాలకృష్ణ, సచివాలయ సెక్రటరి ప్రసాద్‌లతో కలసి ప్రజలకు వివరించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. పార్టీ కొలనుకొండ అధ్యక్షుడు నూతక్కి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కత్తిక రాఘవరావు, గొట్టిపాటి వెంకటేశ్వరరావు, బాణావత్ వెంకటేశ్వరరావు, కలికంటి నాగరాజు, హరిబాబు పాల్గొన్నారు.

– దుగ్గిరాలలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచ్ ఖుషీబాయ్‌తో కలసి ఆవిష్కరించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణలు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరయ్య, మండల ప్రెసిడెంట్ శృంగారపాటి రత్నం, సుభాని, సచివాలయ సెక్రటరీ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఇంటికీ లబ్ధి..**

ఫిరంగిపురం: నవరత్నాల పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని గుండాలపాడు గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పథకాల ద్వారా గ్రామానికి చేకూరిన లబ్ధిని తెలియజేసే బోర్డును శివరామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. నాయకులు డి.సురేష్, ఎం.సుధాకరరెడ్డి, ఎస్.నాగరాజు, డి.ప్రకాశరావు, టి.కృష్ణ, రాజేష్, సైదా, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సత్యానంద్, కార్యదర్శి లక్ష్మీ శారద, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**అన్నివర్గాలకు సమన్యాయం ..**

నెక్కల్లు(తాడికొండ): అన్ని వర్గాలకు సమన్యాయం అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎంగా గెలిపించుకోవాలని తుళ్లూరు మండల సీనియర్ నాయకుడు కొప్పుల శేషగిరిరావు అన్నారు. బుధవారం తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాయకులు గుమ్మా శ్రీనివాసరావు, డీజే శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ న్యాయం.. సీఎం జగన్ వల్లే సాధ్యం

మేడికొండూరు: సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమయిందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మంగళగిరిపాడులో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఏది అవసరమో దాన్ని గుర్తించిన సీఎం జగన్ నవరత్నాల పథకాల ద్వారా అందించారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వస్తారని, వారు అన్ని ఫ్రీ ఇస్తామని ప్రజలను మోసం చేస్తారని, వారి మాటలు వినొద్దన్నారు. కల్లబొల్లి మాటలతో కనికట్టు చేస్తారని, వారిని నమ్మొద్దన్నారు. మంగళగిరిపాడు గ్రామానికి రూ.13కోట్లు నిధులు అందజేశామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం విషయంలో రాజీపడకుండా సీఎం జగన్ పథకాలు అందించారన్నారు. లబ్ధిదారులకు జగనన్న సురక్ష ద్వారా వైద్యం అందించారన్నారు. మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, సర్పంచ్ రబ్బాని, ఎంపీటీసీ బాసీ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, ఉపసర్పంచ్ సోమయ్య, రత్తయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న మళ్లీ సీఎం కావాలంటూ తిరుమలకు పాదయాత్ర

**మంగళగిరి చేరకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాదయాత్ర**



ఎమ్మెల్సీ రఘురాజుకు ఘనస్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో తిరిగి ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతోనే తమ సొంతూరి నుంచి 43 రోజుల పాటు తిరుపతికి పాదయాత్ర చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ రఘురాజు తన సొంతూరు బోదర నుంచి చేపట్టిన పాదయాత్ర బుధవారం మంగళగిరి నియోజకవర్గం చేరుకుంది. సమాచారం అందుకున్న నాయకులు, కార్యకర్తలు రఘురాజు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ జాతీయ రహదారిపై ఆత్మకూరు వద్ద ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీతో కలిసి తెనాలి ఫ్లైఓవర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 19, 20 తేదీల్లో బాలోత్సవం



బ్రోచర్ విడుదల చేస్తున్న డీఈఓ శైలజ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాలోత్సవం ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్ 19, 20వ తేదీల్లో మంగళగిరి మండలం యర్రబాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్లో జరగనున్న మంగళగిరి–తాడేపల్లి బాలోత్సవం (రెండో పిల్లల పండుగ) బ్రోచర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మొత్తం 42 రకాల అకడమిక్, కల్చరల్ పోటీలు బాలోత్సవంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తుళ్లూరు, రాజధాని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు ఈ పండుగలో పాల్గొనాలని కోరారు. ఉరుకుల, పరుగుల జీవితంలో పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించే తీరిక లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులు సమాజంలో నెలకొన్నాయని అన్నారు. బాలల్లో ప్రతిభా పాఠవాలు, శక్తి, సామర్థ్యాలు పెరుగుతుండగా, సినిమాలు, సాంస్కృతిక రూపాలు సైతం సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, టీవీల ద్వారా పిల్లలకు అందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఆట పాటలు, వ్యాయామం శారీరక శ్రమ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంటీఎంసీ బాలోత్సవం గౌరవాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, అధ్యక్షుడు వీవీ ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవం విజయవంతానికి ఇప్పటికే 150 పాఠశాలలకు బ్రోచర్లు అందచేశామని చెప్పారు. రెండ్రోజులపాటు జరిగే ఈ పిల్లల పండుగకు సుమారు 4వేల మంది పిల్లలు హాజరవుతారన్నారు.ఉపాధ్యక్షుడు యడ్ల బాలకృష్ణ, కార్యదర్శి ప్రగడా రాజశేఖర్, పి.శ్రీలక్ష్మి, జె.శేషయ్య, కోశాధికారి గాదే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ తాగునీరు జల్‌జీవన్ మిషన్ లక్ష్యం



వడ్డమాను(తాడికొండ): ప్రతి ఇంటికీ తాగునీటిని అందించి దాహార్తి తీర్చేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం వరంలా మారిందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.35 లక్షలతో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి అందించే పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానీటిని ఒడిసిపట్టి ప్రజల దాహార్తి తీర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జల్‌జీవన్ మిషన్ పనులు రాష్ట్రంలో వడివడిగా కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని గాలికొదిలి రాజధాని పేరుతో నిలువు దోపిడీ చేశాడన్నారు. ప్రజలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం తప్ప పేదలకు బాబు చేసిందేమీ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పేదవాడికి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, గ్రామ అధ్యక్షుడు గొట్టం వెంకట నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో మేడికొండూరు మండలం ద్వాక్రా ఏపీఎం విజయభారతి, పేరేచర్ల పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. బాల్య వివాహాలపై వచ్చే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణంలో సచివాలయం, అంగన్‌వాడీ, ద్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేశారు.

### నేడు ప్రత్యేక పూజలు



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం(శివాలయం)లో శివుడు జన్మదినోత్సవం(ఆరుద్ర నక్షత్రం) పర్వదినం సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు తెలకదేవరపల్లి శ్యామసుందర శాస్త్రి బుధవారం తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రంతో పాటు 53 వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం గణపతి పూజ, బిల్వార్చన, గోపూజ, మహన్యాస పూర్వక ఫలరస పంచామృతాభిషేకాలు, బిల్వార్చన, అన్నాభిషేకం, శివకల్యాణం, కుంకుమార్చనల అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయబడునని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.